వంతెన ఛిద్రం.. ప్రయాణం నరకం



భామిని మండలం దిమ్మిడిజోల, అనంతగిరి గ్రామాల మధ్య వంశధార వరద కాలువపై ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. దీనిపైనే ఒడిశా, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ తదితర జిల్లాలకు రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం వంతెన పాడవడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ర.భ శాఖ ఏఈ జగన్మోహనరాజు వద్ద ప్రస్తావించగా.. వంతెనపై రహదారిని మెరుగుపరుస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, భామిని

చిన్నారులకు విద్య, పోషకాహారం తప్పనిసరి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పిల్లలకు పోషకాహారం, విద్య చేరువ చేయాలని



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని డోకిశీల పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. డోకిశీలలో గదులు సరిపోవడం లేదని కార్యకర్త తెలపగా.. మరో గది కేటాయించాలని ఎంపీడీవో రూపేష్‌కు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రం పరిసరాలు శుభ్రం చేసి పిల్లల పార్కు ఏర్పాటు చేయాలని సర్పంచి జగదీశ్, కార్యదర్శి మధును ఆదేశించారు. డెప్పివలసలో నిర్మాణంలో ఉన్న వనదన్ వికాస కేంద్రాలను పరిశీలించి మహిళలు వినియోగించేలా చూడాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, డీఎల్‌డీవో రమేష్, తహసీల్దారు జయలక్ష్మి, ఐసీడీఎస్ పీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిఖరమే మిగులు.. కొండ కనుమరుగు

★ అనుమతులు లేకుండానే దర్జాగా తవ్వకాలు

పాలకొండ నియోజకవర్గంలో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయి. అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొండలను కొల్లగొడుతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి అక్రమార్కులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన యంత్రాంగం నామమాత్రపు చర్యలతో సరిపెడుతోంది. వెరసి విలువైన కంకర రాశులు పలువురికి కాసులు కురిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో అట్టలి సమీపంలో కొండ పూర్తిగా కంకర రాశులతో నిండి ఉంది. గత అయిదేళ్లుగా వేలాది వాహనాలతో అక్రమంగా గ్రావెల్‌ను తరలించారు. దీంతో కొండ ఒకవైపు సగభాగం తరిగిపోయింది. ఇక తవ్వకాలకు అవకాశం లేకపోవడంతో ఇదే మార్గంలో కొండ వెనుక తవ్వకాలు ప్రారంభించారు. రాత్రీ పగలూ తేడా లేకుండా కంకర తరలిస్తున్నారు.



సగం మేర తవ్వేసిన అట్టలి కొండ

మరోవైపు టీకేరాజపురం-టీడీపారాపురం రహదారిలో ఉన్న కొండపై అక్రమార్కుల దృష్టి పడింది. గతకొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో జేసీబీల సాయంతో వందలాది వాహనాల్లో కంకర తరలించారు.



కొండ వెనుక ఇలా..

జరిమానాలు విధించినా..

గతంలో ఈ అట్టలి కొండపై తవ్వకాలు జరుగుతున్న సమయంలో గనులశాఖ అధికారులు దాడులు చేశారు. అప్పట్లో జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్ చేశారు. అక్రమార్కులకు రూ.12 లక్షల వరకు జరిమానా విధించారు. అనంతరం గత కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి హద్దులు నిర్ణయించారు.



టీకేరాజపురం వైపు ప్రస్తుతం కొల్లగొడుతున్న ప్రాంతం

అనుమతులకు ఆస్కారం లేదు

కంకర తవ్వడానికి అనుమతులు ఇచ్చే అధికారం రెవెన్యూ శాఖకు లేదు. అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు. ఇప్పటికే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మేం సైతం దాడులు నిర్వహించి పట్టుబడిన వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం.

– బాలమురళీకృష్ణ, తహసీల్దారు, పాలకొండ



మాట్లాడుతున్న పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి

మెనూ అమల్లో తేడాలుంటే చర్యలు

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. మెనూ అమల్లో తేడాలుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించాలని, జీసీసీ ద్వారా మాత్రమే సరకులు కొనాలని, నాణ్యత లోపిస్తే తిరిగి ఇచ్చేయాలని సూచించారు. ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర, డీడీ ఈవో పి.నారాయుడు, ఏఎంవో పి.కోటిబాబు, జీసీడీవో రాములమ్మ పాల్గొన్నారు.

తల్లులూ.. మీరే మార్గనిర్దేశకులు

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తోంది. మన్యంలోని విద్యాసంస్థల్లో ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ, గురుకులాలు, వసతి గృహాల్లో భోజనాల తనిఖీల్లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేయనుంది. ఆయా విద్యాలయాల్లో వంట శాలలు, సరకు నిల్వ గదులు, పరిసరాల పరిశుభ్రత తోడ్పాటుకు ప్రామాణిక నిర్వహణ విధానం తెరమీదకు తీసుకొచ్చింది.

– న్యూస్‌టుడే, సీతంపేట

విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను నేరుగా వారి తల్లులే రుచి చూస్తారు. దీని కోసం ముగ్గురితో కూడిన కమిటీ వేస్తారు. వారు వారానికో సారి తనిఖీ చేస్తారు. ఆ వివరాలను దస్త్రాల్లో నమోదు చేస్తారు. రోజుకో ఉపాధ్యాయుడు లేదా బోధనేతర సిబ్బంది విద్యార్థులతో కలిసి భోజనం తింటారు. ముందుగా వండిన ఆహారాన్ని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. తర్వాత ప్రిన్సిపల్ రుచి చూశాక విద్యార్థులకు వడ్డించాలి. ఏటా ఆగస్టు, ఫిబ్రవరిలో తాగునీటిని పరీక్షించేందుకు నమూనాలను ల్యాబ్‌కు పంపాలి.



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న సిబ్బంది (పాతచిత్రం)

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 65 ఆశ్రమ పాఠశాలలు, 24 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు, 15 గిరిజన గురుకులాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మరికొన్ని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు ఉన్నాయి.

పరిశుభ్రతకు పెద్దపీట

వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆహారాన్ని వండే ముందు, తర్వాత వంట పాత్రలు, గ్యాస్ స్టవ్‌లు శుభ్రం చేయాలని సూచించింది. కుళ్లిన కూరగాయలు, కోడి గుడ్లు వినియోగించకూడదని స్పష్టం చేసింది. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు కడగడం, నిర్దేశిత సమయాల్లో నీళ్లు తాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. కమిటీల నియామకం వేగవంతంతో ఆహార ప్రణాళిక పక్కాగా అమలు జరుగుతుందని, విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేసింది.

మరింత మంచి జరుగుతుంది

ఆహారం తనిఖీకి తల్లులతో కమిటీ వేయడం వల్ల నాణ్యత మెరుగుపడుతుంది. పర్యవేక్షణ పెరగడంతో ఏ చిన్న తప్పు జరగదు. విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు భోజనం చేయడంతో రుచి తెలుస్తుంది. నేను కూడా రోజూ ఏదో ఒక విద్యాసంస్థలో భోజనం తింటుంటాను. ఇలా చేయడం ద్వారా లోపాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు మేలు కలిగిస్తుంది.

–ఎం.అన్నాదొర, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి, సీతంపేట

డిపోలకు కొత్త బస్సులు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామని గొప్పలు చెప్పుకొంది. కానీ, ఉద్యోగులు, ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. డొక్కు బస్సులతోనే అయిదేళ్ల కాలం వెళ్లదీసింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం కాలం చెల్లిన బస్సులను పక్కన పెడుతూ.. కొత్తవి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తోంది. జిల్లాలోని మూడు డిపోలకు కొత్త అద్దె బస్సులు మంజూరు చేసింది. ఇందులో పార్వతీపురం అయిదు, పాలకొండ ఆరు, సాలూరు నాలుగు కేటాయించింది. వీటిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్‌లు ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు దూర ప్రయాణాలకు ప్రయోజనం కలగనుంది. పాలకొండ డిపోకు వచ్చిన బస్సులను అవసరమైన ప్రాంతాలకు నడుపుతున్నట్లు డీఎం పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రతి సచివాలయంలో కంటి పరీక్షలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: అరవై ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ సచివాలయాల్లో కంటి పరీక్షలు చేయాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అవ్వాతాతలను నవంబరు 1 నుంచి పరీక్షించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసేలా, కళ్లద్దాలు అందించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో 260 పాఠశాలల్లో 52,132 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, 16,035 మందికి అద్దాలు అవసరంగా గుర్తించామని డీఈవో పగడాలమ్మ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి జి.నగేష్‌రెడ్డి, అంధత్వ నివారణాధికారి సుకుమార్‌బాబు, డీసీహెచ్ఎస్ వాగ్దేవి, మహిళా శిశు సంక్షేమ పీడీ ఎంఎన్.రాణి తదితరులు పాల్గొన్నారు.

దారులకు డబ్బులే డబ్బులు

ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు

ఈనాడు–విజయనగరం: ఉమ్మడి జిల్లాలో రోడ్ల అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో పాత బకాయిలతో పాటు అదనపు నిధుల విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత అయిదేళ్లలో అధికారంలో ఉన్న వైకాపా కనీసం పట్టించుకోలేదు. గుత్తేదారులు చేసిన పనుల బిల్లులను సైతం పెండింగ్‌లో పెట్టింది. ఈక్రమంలో చాలాచోట్ల మధ్యలోనే ఆపేశారు. తాజాగా రూ.50 కోట్ల బకాయిలు చెల్లించనున్నారు. ఇతర గ్రాంట్ల ద్వారా మరో రూ.10 కోట్లు విడుదలైనట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి తెలిపారు. మరమ్మతులకు రూ.7.64 కోట్లు వచ్చాయని చెప్పారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విజయనగరం జిల్లాలో 79.90 కి.మీల మేర పనులు జరగనున్నాయని వెల్లడించారు.

మన్యానికి రూ.23 కోట్లు

పార్వతీపురం మన్యం జిల్లాకు త్వరలో ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేయనుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో ఇప్పటికే చర్చించామన్నారు. మరమ్మతులకు రూ.11.72 కోట్లతో ఈనెల 17న టెండర్లు తెరిచామన్నారు. బత్తిలి, భామిని, కొమరాడ తదితర అధ్వాన రహదారులపై తొలుత దృష్టిసారిస్తామని చెప్పారు. డిసెంబరులోగా పూర్తిచేస్తామన్నారు.



ఈనాడు–విజయనగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యవసర పనులకు నిధులు సమకూర్చే పనిలో ఉన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళగిరిలో శుక్రవారం తెదేపా శాసనసభా పక్ష సమావేశం జరిగింది. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, తోయక జగదీశ్వరి, బేబినాయన, కోండ్రు మురళీమోహన్ హాజరయ్యారు.


మా పల్లెకూ ఆస్తులంట

రూ.27.43 కోట్లతో పనులు

న్యూస్‌టుడే, పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులు ఇప్పటి వరకు పంచాయతీల నిర్వహణ, పారిశుద్ధ్యం, వేతనాల చెల్లింపునకు వినియోగిస్తున్నారు. ఇకపై 50 శాతం నిధులతో పంచాయతీకి సంబంధించి కొన్ని ఆస్తులను సమకూర్చాల్సిన అవసరం ఉందని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనరు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో 451 పంచాయతీలకు ఒక్కో విడతకు రూ.15 కోట్లు వంతున మూడు విడతల్లో రూ.45 కోట్లు విడుదల కానున్నాయి. వీటితో పాటు మరో రూ.10 కోట్లు పంచాయతీల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తం పారిశుధ్యం, నిర్వహణ పనులకే వెచ్చించకుండా కనీసం 50 శాతం నిధులతో పంచాయతీల్లో సామాజిక అవసరాలు తీర్చనున్నారు. ఆ మేరకు రూ.27.43 కోట్లతో 1,532 పనులు చేపట్టాలని నిర్ణయించారు.



జిల్లాలో గుర్తించిన పనులు

అంశం	అంచనా (రూ.కోట్లలో)
నీటి పథకాల మరమ్మతులు	0.85
వీధి కుళాయిలకు సిమెంటు దిమ్మెల నిర్మాణం	3.56
కొత్త బోరుబావుల తవ్వకం	0.47
పశువుల తొట్టెలు	0.21
ఆర్వో ప్లాంట్లు	0.57
సామాజిక పారిశుద్ధ్య కాంప్లెక్సులు	0.17
మహిళల మరుగుదొడ్లు	0.07
చెత్త సేకరణకు తొట్టెలు	0.13
వీధి రహదారులు	0.21
రహదారుల నిర్వహణ	3.21
సంత షెడ్ల నిర్మాణం	0.54
బస్ షెల్టర్ల నిర్మాణం	1.09
రచ్చబండలు, బెంచీల నిర్మాణం	4.30
గ్రామ స్వాగత ద్వారం	2.52
దోబీఘాట్‌లు, నీటివసతి	0.17
ఆహార పదార్థాలు ఆరబెట్టుకునే ప్లాట్‌ఫారాలు	0.08
వ్యాయామశాలలు, ఉద్యానాలు	0.22
సమావేశ మందిరాలు	2.61
ఇతర పనులు	6.54

23న ప్రారంభించాలి

పంచాయతీల్లో గుర్తించిన పనులకు ఈనెల 23 నాటికి పాలనా, సాంకేతిక అనుమతులు తీసుకొని ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇవన్నీ జనవరి నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఈ దిశగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. – కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి

ఫుల్లుగా సొమ్ములొచ్చాయ్

● 2 ఏళ్లు.. రూ.270 కోట్ల ఆదాయం ● దరఖాస్తులపై రూ.132 కోట్లు అదనం

ఈనాడు, పార్వతీపురం మన్యం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఈ నెల 16 నుంచి తెరుచుకున్నాయి. పాటదారులు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులో ఆరో వంతు రూ.15.02 కోట్లు ప్రభుత్వానికి కట్టారు.



సీతానగరంలో తెరిచిన మద్యం దుకాణం

విజయనగరం, మన్యం జిల్లాలోని 205 దుకాణాలకు తొలి రోజు 140కి పైగా, రెండో రోజు మరో 49 ప్రారంభం అయ్యాయి. నెల్లిమర్ల, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోల్లో తొలి రోజు రూ.12 కోట్ల విలువైన మద్యం, రెండో రోజు రూ.9 కోట్లు, మూడో రోజు రూ.7 కోట్లకు పైగా విలువైన సరకు విడిపించారు.

ఉభయ జిల్లాల్లో ఎక్సైజ్ పన్ను వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	ఎక్సైజ్ సర్కిళ్లు	దుకాణాలు	కిస్తీ	వార్షిక ఆదాయం	రెండో ఏడాది
విజయనగరం	10	153	16.28	97.70	107.47
పార్వతీపురం మన్యం	05	52	5.30	31.20	34.32

జే బ్రాండ్లు వెనక్కి


వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించిన జే బ్రాండ్ మద్యం చాలా చోట్ల మిగిలిపోయింది. సుమారు 20 వేలకు పైగా బాక్సులు ఉండగా.. దానికి సంబంధించి అధికారులు లెక్కలు తేల్చి ఐఎంఎల్ డిపోలకు తరలించాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.


అంచనాలకు మించి ఆదాయం

విజయనగరం జిల్లాలో పది ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 153 దుకాణాలు.. పార్వతీపురం మన్యం జిల్లాలో 5 సర్కిళ్ల పరిధిలో 52 దుకాణాలు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో 6,634 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.132.68 కోట్ల ఆదాయం సమకూరింది. విజయనగరం జిల్లాలో తొలి ఏడాది లైసెన్స్ ఫీజు కింద రూ.97.7 కోట్లకు ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తుల రూపంలో రూ.104.82 కోట్లు వచ్చింది. మన్యం జిల్లాలో తొలి ఏడాది లైసెన్స్ ఫీజు కింద రూ.31.20 కోట్లు, దరఖాస్తుల రూపంలో రూ.27.86 కోట్లు ఆదాయం చేరింది.

★ విజయనగరం జిల్లాలో వార్షిక రుసుములో తొలి కిస్తీ కింద రూ.16.28 కోట్లు, మన్యం జిల్లాలో రూ.5.30 కోట్లు దుకాణాలు దక్కించుకున్న 48 గంటల్లోనే చెల్లించారు.

★ తొలి ఏడాది రూ.55 లక్షలు రుసుము ఉన్న దుకాణానికి వచ్చే ఏడాది పది శాతం పెంపుతో రూ.60.50 లక్షలు.. రూ.65 లక్షల దుకాణానికి రూ.71.50 లక్షలు చెల్లించాలి. దీంతో ప్రభుత్వానికి తొలి ఏడాది కంటే రెండో ఏడాది ఆదాయం పెరగనుంది.





(c) eenadu



కర్రలే విద్యుత్తు స్తంభాలు

ఈ చిత్రాన్ని చూశారా.. సాలూరు పురపాలక సంఘం పరిధిలోని రామాకాలనీలోని పరిస్థితి ఇది. ఇక్కడ విద్యుత్తు స్తంభాలు కానరావడం లేదు. దీంతో దూరంగా ఉన్న స్తంభాల నుంచి తీగలను ఇక్కడ కలిపేందుకు పలువురు ఇలా కర్రలు పాతారు. ఇక్కడ వీధిదీపాలు దిక్కే లేదు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నామని అక్కడివారు వాపోతున్నారు. గత అయిదేళ్లు అధికారులు, నాటి ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్తంభాలు, దీపాలు వేయిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

దారులు దారుణం ఒళ్లు హూనం


అధ్వానంగా కలిగొట్టు ప్రధాన మార్గం



కురుపాం మండలంలోని కలిగొట్టు గ్రామం నుంచి ఉదయపురం పంచాయతీ కేంద్రానికి వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే తారు ఊడిపోయి, కోతకు గురై రాళ్లు తేలియాయి. దీంతో గతంలో ఈ గ్రామానికి ఉన్న ఆర్టీసీ సర్వీసును సైతం నిలిపేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అప్పారావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదించి మరమ్మతులు చేయిస్తామన్నారు. ★ బలిజిపేట మండలంలోని గంగాడ నుంచి గలావల్లి వెళ్లే రహదారిది ఇదే దుస్థితి. చాలా చోట్ల కోతకు గురై రాళ్లు తేలాయి. కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం గొయ్యి చుట్టూ కర్రలు పెట్టి వదిలేశారు. రహదారి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణరావు వివరణ కోరగా.. రూ.50 లక్షలు మంజూరయ్యాయని, రహదారి బాగు చేస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం, బలిజిపేట



తవ్వేసి.. ప్రమాదాలకు వదిలేసి

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో పైపులైన్ల మరమ్మతులకు గుంతలు తీసి వదిలేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో పెద్దఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితికి అద్దం పడుతోంది కంటోన్మెంట్ ప్రాంతంలోని ఈ భారీ గొయ్యి. స్థానిక హిందూ ఎలిమెంటరీ పాఠశాల నుంచి బాలాజీ మార్కెట్‌కు వెళ్లే దారిలో 20 రోజుల కిందట ప్రధాన రోడ్డు మధ్యలో భారీ గుంత తవ్వారు. నేటికీ పూడ్చలేదు. కలెక్టరేట్, గంట్యాడ, గజపతినగరం వైపునకు వెళ్లే మార్గం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే పూడుస్తామని ఏఈ రవి తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వాల్తేర్ బ్రాంచ్-06331, కురుపాం టవర్స్ దగ్గర, వాల్తేరు రోడ్డు, విశాఖపట్నం-530017. ఫోన్: 0891-2546826, ఇ-మెయిల్: UBIN0806331@unionbankofindia.bank

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

టు:

(1) M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: 201, రత్నశ్రీ కాంప్లెక్స్, శంకరమఠం రోడ్డు, ద్వారకానగర్, విశాఖపట్నం-530016, ఆంధ్రప్రదేశ్. 1.a. M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాంట్ చిరునామా: 3C/2, ఎ.పి.ఐ.ఐ.సి. జోన్, కంటకపల్లి గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. 2) శ్రీ శివప్రసాద్ సింగుపురం, తండ్రి: ఈశ్వరప్ప, (వ్యక్తిగత హామీతో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్), నివాస చిరునామా: ఫ్లాట్ నెం.A-205, క్లోవర్ మెజెస్టిక్ టవర్స్, ఆర్.కె. బీచ్, విశాఖపట్నం-530003. 2.a. శ్రీ శివప్రసాద్ సింగుపురం (వ్యక్తిగత హామీతో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్), ప్లాంట్ చిరునామా: M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 3C/2, ఎ.పి.ఐ.ఐ.సి. జోన్, కంటకపల్లి గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. 3) శ్రీమతి సింగుపురం లావణ్య, భర్త: ఎస్. శివప్రసాద్, (వ్యక్తిగత హామీ ఉన్న ఒక డైరెక్టర్), నివాస చిరునామా: ఫ్లాట్ నెం.A-205, క్లోవర్ మెజెస్టిక్ టవర్స్, ఆర్.కె. బీచ్, విశాఖపట్నం-530003. 3.a. శ్రీమతి సింగుపురం లావణ్య (వ్యక్తిగత హామీ ఉన్న ఒక డైరెక్టర్), ప్లాంట్ చిరునామా: M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 3C/2, ఎ.పి.ఐ.ఐ.సి. జోన్, కంటకపల్లి గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. 4) శ్రీమతి కొత్తకోట రేఖ, భర్త: కె. నారాయణమూర్తి, (వ్యక్తిగత హామీ ఉన్న ఒక డైరెక్టర్), నివాస చిరునామా: డి.నెం.16-11-60(పాత), కొత్త డి.నెం.302, వీధి నెం.100, కిమ్స్ హాస్పిటల్ దగ్గర, ఫజుల్‌బేగ్‌పేట @ సీవనాయుడుపేట గ్రామం, శ్రీకాకుళం-532410. 4.a. శ్రీమతి కొత్తకోట రేఖ (వ్యక్తిగత హామీ ఉన్న ఒక డైరెక్టర్), ప్లాంట్ చిరునామా: M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 3C/2, ఎ.పి.ఐ.ఐ.సి. జోన్, కంటకపల్లి గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా. 5) శ్రీ కొత్తకోట నారాయణమూర్తి (హామీదారు), తండ్రి: కె. పెంటన్న (లేటు), నివాస చిరునామా: డి.నెం.16-11-60(పాత), కొత్త డి.నెం.302, వీధి నెం.100, కిమ్స్ హాస్పిటల్ దగ్గర, ఫజుల్‌బేగ్‌పేట @ సీవనాయుడుపేట గ్రామం, శ్రీకాకుళం-532410. 5.a. శ్రీ కొత్తకోట నారాయణమూర్తి (హామీదారు), ప్లాంట్ చిరునామా: M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 3C/2, ఎ.పి.ఐ.ఐ.సి. జోన్, కంటకపల్లి గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద బ్యాంకు బకాయి మొత్తము వసూలు కొరకు M/s. ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ శివప్రసాద్ సింగుపురం, శ్రీమతి సింగుపురం లావణ్య, శ్రీమతి కొత్తకోట రేఖ మరియు శ్రీ కొత్తకోట నారాయణమూర్తి గార్లకు చెందిన ఆస్తులు అమ్మకం. (షెడ్యూలు ఆస్తుల వివరములు దిగువన తెలుపబడినవి).

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వాల్తేరు బ్రాంచ్, విశాఖపట్నం** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది **15.05.2024**న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని తేదీ **13.09.2024**న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

ప్రైమరీ సెక్యూరిటీ మరియు కొలెట్రాల్ సెక్యూరిటీ వివరములు:

ఎ: ప్రైమరీ సెక్యూరిటీ వివరములు: **(డిమాండ్ నోటీసు తేది 15.05.2024న జారీచేయడమైనది మరియు సెక్షన్ 13(4) క్రింద తేది 13.09.2024 న స్వాధీనత తీసుకోవడమైనది)** 1) విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, కంటకపల్లి గ్రామం, ఇండస్ట్రియల్ పార్క్ కంటకపల్లి, సర్వే నెం. 179, 181, 182, 249, 253 లోని హైపొథికేట్ చేయబడిన ట్రేడ్ లోని స్టాక్ అనగా రా మెటీరియల్, వర్క్ ఇన్ ప్రోగ్రెస్ మరియు ఫినిష్డ్ గూడ్స్ మరియు రిసీవబుల్, గూడ్స్ ఇన్ ట్రాన్సిట్, హైపోథికేషన్ ఆఫ్ ప్లాంట్ మరియు మెషినరీ, ఎలక్ట్రికల్ ఐటమ్స్, కంప్యూటర్ మరియు హార్డ్‌వేర్ మొ॥.

2) తనఖా పెట్టిన ఆస్తి (ప్రైమరీ): (డిమాండ్ నోటీసు తేది 15.05.2024న జారీచేయడమైనది మరియు సెక్షన్ 13(4) క్రింద తేది 13.09.2024 న స్వాధీనత తీసుకోవడమైనది) (విజయనగరం కొత్తవలస ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం: 6481/2021, తేది. 06.11.2021 ప్రకారం మెస్సర్స్, ఫుడ్ స్మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తి): విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, కంటకపల్లి గ్రామం, ఇండస్ట్రియల్ పార్క్ కంటకపల్లి, సర్వే నెం. 179, 181, 182, 249, 253, APIIC కేటాయించిన ప్లాట్ నెం: 3/C2 లోని **12,141 చ॥మీ॥ ఇండస్ట్రియల్ భూమి మరియు ఫ్యాక్టరీ బిల్డింగ్ మరియు ఇతర సివిల్ నిర్మాణాలు. ఆస్తికి హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 3C/2A & ప్లాట్ నెం. 3C-2/1A, **దక్షిణం:** ప్లాట్ నెం. 1, **పడమర:** ప్లాట్ నెం. 3C1, **ఉత్తరం:** ప్రతిపాదిత 12.20 మీ॥ వెడల్పు రోడ్డు. **వాస్తవిక హద్దులు: తూర్పు:** ఇతరులకు చెందిన ఖాళీస్థలం, **దక్షిణం:** శారద ఫెర్రో అల్లాయిస్ లిమిటెడ్, **పడమర:** సన్ రైజ్ ఎక్స్‌పాల్ట్, **ఉత్తరం:** 40 అ॥ వెడల్పు రోడ్డు.

బి: కొలెట్రాల్ సెక్యూరిటీ వివరములు: **(డిమాండ్ నోటీసు తేది 15.05.2024న జారీచేయడమైనది మరియు సెక్షన్ 13(4) క్రింద తేది 13.09.2024 న స్వాధీనత తీసుకోవడమైనది) (శ్రీకాకుళం ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం: 33/2007, తేది. 05.01.2007 ప్రకారం శ్రీ కొత్తకోట నారాయణ మూర్తి, తండ్రి: లేటు పెంటన్నకు చెందిన ఆస్తి):** శ్రీకాకుళం, ఫజుల్‌బేగ్‌పేట @ సీవనాయుడుపేట గ్రామం, కిమ్స్ హాస్పిటల్ దగ్గర, సర్వే నెంబ. 52/20 & 52/21, డి.నెం.16-11-60 కలిగిన **556.60 చ॥గ॥ లేదా 464.76 చ॥మీ॥** విస్తీర్ణంలోని క్రింది అంతస్తు మరియు మొదటి అంతస్తు గల రెసిడెన్షియల్ బిల్డింగ్ శ్రీ కె నారాయణ మూర్తి పేరున గలదు. **ఆస్తికి హద్దులు: తూర్పు:** ఎస్. చిరంజీవి ఖాళీస్థలం, **దక్షిణం:** బి. ఆదిపమ్మ ఖాళీ స్థలం, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ఎస్. కృష్ణ మూర్తి ఖాళీ స్థలం. **వాస్తవిక హద్దులు: తూర్పు:** ఎస్. చిరంజీవి ఖాళీ స్థలం, **దక్షిణం:** బి. ఆదిపమ్మ గారి బిల్డింగ్, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** రోడ్డు తరువాత ఎస్. కృష్ణ మూర్తి బిల్డింగ్.

తేది: 09.10.2024, స్థలం: విశాఖపట్నం — సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

శిక్షకులు తోడుగా.. కొలువుల పండగ



ఒకప్పుడు వారంతా క్రీడాకారులు.. ఎన్నో ఆటుపోట్లను అధిగమించి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. నమ్ముకున్న క్రీడను విడవకుండా ముందుకు సాగుతూ.. నేడు ఎంతో మందికి వెన్నుదన్నుగా నిలుస్తూ శిక్షకులుగా సేవలందిస్తున్నారు. పతకాలు తెచ్చేలా తీర్చిదిద్దుతున్నారు. కొలువుల అన్వేషణలో ఉన్న నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ అవసరమైన తర్ఫీదునిస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు శిక్షకులు. వారి ప్రస్థానంపై కథనం. - న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

సవాళ్లను అధిగమిస్తూ..

అంతర్జాతీయ వేదికపై పారా అథ్లెట్‌గా సత్తా చాటిన వై. మధుసూదనరావు స్వస్థలం కెల్ల. వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. పదో ఏట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ చేయి దెబ్బతింది. అయినాసరే తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని, అప్పుడే గుర్తింపు వస్తుందని భావించి మైదానంలోకి అడుగుపెట్టాడు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. 2016లో జైపూర్‌లో జరిగిన టోర్నీలో రెండు కాంస్యాలు, హరియాణా మీట్‌లో(2017)లో రెండు రజతాలు, స్వర్ణం సాధించాడు. 2018లో జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ టోర్నమెంటులో 100, 200 మీటర్ల పరుగులో రాణించాడు. ఎచ్చెర్ల శిక్షణ ఇస్తున్నారు. తన వద్ద సాధన చేసిన వారిలో 50 మంది వరకు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యారని ఆయన చెబుతున్నారు.

ప్రథమస్థానం..

నగరానికి చెందిన ఎ. గణేష్ వెంపడాం జడ్పీ పాఠశాలలో పీడీగా సేవలందిస్తున్నారు. 2012 డీఎస్సీలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచారు. గురువుగా, శిక్షకుడిగా పనిచేస్తున్నారు.

100 మందికి ఉద్యోగాలు



దాసన్నపేట ప్రాంతానికి చెందిన జె.నర్సింగ రావు మాన్సాస్ పాఠశాలలో పీఈటీగా చేస్తున్నారు. 100, 400మీ పరుగులో ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో 20 సార్లు, జాతీయస్థాయిలో రాణించారు. పాఠశాలలో పాటు విజ్జీ మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణనిస్తున్నారు. రైల్వే, ఎస్ఎస్‌సీ, పోలీసు శాఖలో 100 మంది వరకు యువకులు చేరినట్లు వెల్లడించారు.

అథ్లెట్‌గా 800 మీటర్ల పరుగులో జాతీయస్థాయి పతకాన్ని దక్కించుకున్నారు. జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణం, రెండు రజతాలు సాధించారు. ఆలిండియా టోర్నీలో స్వర్ణంతో మెరిశారు. వివిధ విభాగాల్లో 11 మంది శిష్యులు కొలువులు సాధించారని చెప్పారు.



పీఈటీగా చేస్తూ..



2009లో పీఈటీగా ప్రస్థానం ప్రారంభించిన ఎ.రామకృష్ణ ప్రస్తుతం పాలవలస జడ్పీ పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. కేవలం వ్యాయామ ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా తాను నేర్చుకున్న విద్యను మరికొంతమందికి అందిస్తున్నారు. హైజంప్‌లో జాతీయస్థాయిలో రెండుసార్లు, హ్యాండ్‌బాల్‌లో ఒకసారి సత్తా చూపారు. తన శిక్షణలో ఆరితేరి ఇప్పటివరకు 20 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. తాను పనిచేస్తున్న పాఠశాలలో 8 మందిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు.

అదే లక్ష్యం..



నిరుపేద కుటుంబంలో పుట్టి తిరుగులేని అథ్లెట్‌గా ఎదిగాడు సీతానగరం మండలం గాదెలవలసకు చెందిన ఎ.లక్ష్మణ్. డిగ్రీతో పాటు క్రీడ విద్య కోర్సు పూర్తిచేసి 'ఈనాడు' ప్రోత్సాహంతో లక్ష్య బృందంలో చేరారు. ప్రస్తుతం బలిజిపేట మండలం పిలకలపల్లిలో శిక్షణ ఇస్తున్నారు. 2013లో సాధన ప్రారంభించి 2014లో స్కూల్‌గేమ్స్ అండర్-14లో అడుగుపెట్టాడు. 2016 నుంచి 2021 వరకు రాష్ట్ర తరపున వివిధ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. అనేక పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. తన వద్ద శిక్షణ పొందిన వారిలో 16 మంది ఆర్మీలో, నలుగురు ఎస్ఎస్‌సీలో, 9 మంది కానిస్టేబుళ్లుగా చేరారని, మరింత మందిని డిఫెన్స్‌లోకి పంపించడమే లక్ష్యమని చెబుతున్నాడు.



ఉత్సాహంగా చదరంగం పోటీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని డీఈవో పగడాలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్ చదరంగం పోటీలను పార్వతీపురంలోని ఆర్సీఎం పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. అండర్- 14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లాల నుంచి వందల సంఖ్యలో బాల, బాలికలు పాల్గొన్నారు. ఒక్కో విభాగం నుంచి 12 మంది చొప్పున 24 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.మురళీకృష్ణ తెలిపారు. డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్, ఎంఈవోలు, పీడీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పాలకొండ, సాలూరు: పాలకొండ, సాలూరు ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సందేహాలు, సలహాల కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను 99592 25057(పాలకొండ), 99592 25622(సాలూరు) నంబర్లకు తెలియజేయాలని సంబంధిత అధికారులు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్‌లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను.
కంపెనీ వారి సంప్రదింపు నంబర్లు:
Volty IoT Solutions
8367307070
9666841234

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Deepthi Dasari (Old Name) has changed my name to Rukmini Deepthi Dasari vide affidivit date 26 -Sep.-2024.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

PLOT FOR SALE

VUDA & RERA approved Plots Near VZM JNTU 25 Acres. Gated layout with 5000 Sft. amenities. Close to National Hwy. 7382766678, 9010622679.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవుడ్ ఇళ్ల స్థలాలు స్పాట్/ వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ల పద్మావతి. 9493640700, 9493640600.

శ్రీకాకుళం జిల్లా, గార మండలం, గారలో DCCB ప్రక్కన రెండువైపుల రోడ్డుతో 8.5 సెంట్లు మరియు రెండు దుకాణాలు, టవర్‌తో నెలకు 30 వేలు అద్దెవచ్చు 20 సెంట్లు కమర్షియల్ స్థలం మరియు సూర్యమహల్ ప్రక్కన ఫంక్షన్‌హాల్స్, బ్యాంక్స్, ఆఫీసు, అపార్ట్‌మెంట్‌లకు అనువైన 43 సెంట్లు క్లియర్ టైటిల్‌తో అమ్మకమునకు కలవు. (నో బ్రోకర్స్) సంప్ర॥ 9866960126, 9912577569.

డైరెక్ట్ NH-16 ఫేసింగ్ అప్రూవ్డ్ ప్లాట్లు భోగాపురం దగ్గరలో 200 గజాలు 90% బ్యాంక్ లోన్, వెంటనే ఇల్లు కట్టుకొనుటకు లభించును. గజం రూ. 13,999/- మాత్రమే. (నెలలోపు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి 1 లక్ష నగదు ఇవ్వబడును.) ఫోన్. 9347353716.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 90008 66020


COMMERCIAL SPACE FOR SALE

Bobbili G+4 Floors 6000sft Sale or Rent @Gandhi Bomma Main Road. Ph: 9133662229, 8764366909

విజయనగరం టౌన్ డాక్టర్స్ వీధి (జడ్డు వారి వీధి) మెయిన్‌రోడ్ ఆనుకొని కమర్షియల్ సైట్ 116 గజాలు (14.5 x 72 ft) స్థలం అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ సంప్ర॥ ✆ 9908335577.

LEASE/ RENT

LEASE/RENT
3500 sft గొడౌన్ (న్యూ)



విజయనగరం టౌన్ దగ్గర జమ్మునారాయణపురం పరిధిలో చిన్నతరహా పరిశ్రమలకు లేదా స్టాక్ పాయింట్‌కి అనుకూలమైన 3500 sft గొడౌన్ (న్యూ) కరెంట్ సదుపాయంతో రెడీగా ఉంది.
లీజుకు గాని అద్దెకు గాని కలదు.
Cont : 8249585462 8332032064

JOBS

పార్వతీపురంనకు దగ్గరలోగల చినగుడబ గ్రామ పంచాయితీ పరిధిలో గల M/S Atyam Mining Pvt. Ltd., నందు Computer Knowledgeతో పాటు Tally Experience గల వ్యక్తులు కావలెను. Contact No. 9440806222.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ వైజాగ్ & శ్రీకాకుళంలో పనిచేయుటకు టీమ్ లీడర్స్ & ప్రమోటర్స్ కావలెను. అర్హత 10 to డిగ్రీ పాస్ (or) ఫెయిల్ 12 K to 25 K ఇంటర్వ్యూ 19th శ్రీకాకుళం Cont : 8919693509.

ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశం (3నెలల కోర్సు) Solar PV Installer, అర్హత: ITI, డిప్లొమా, భోజనం+వసతి కల్పించబడును. ద్వారకానగర్ 3వ లైన్, వైజాగ్. Ph: 9963366009, 9573979344

ఆర్టీసీ బస్సులో దైవ క్షేత్రాలను దర్శిద్దాం

పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో శైవక్షేత్రాలు, శబరిమల, పంచారామాలను దర్శించుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గ పేర్కొన్నారు. శుక్రవారం సంబంధిత గోడప్రతులను విడుదల చేశారు. apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న డీఎం దుర్గ, ఇతర అధికారులు

ఆరు రోజుల ప్యాకేజీ..

శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. 6 రోజుల యాత్రకు బస్సులు అందుబాటులో ఉంటాయి. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, ఎరుమేళి, శబరిమల, మధురై, కంచి, తిరుపతి, విజయవాడ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంటుంది. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ. 7,500, అల్ట్రా డీలక్స్‌కు రూ. 7300 టికెట్‌గా నిర్ణయించారు.

ప్రతి సోమవారం ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని గుంప సోమేశ్వరాలయం, అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర స్వామి, నారాయణపురం నీలకంఠేశ్వర స్వామి, సంగం సంగమేశ్వర స్వామి, తోటపల్లిలో ఆలయాలను ఒక్క రోజులోనే దర్శించుకునేలా బస్సులు నడపనున్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో (ప్రతి సోమవారం) సర్వీసులు ఉంటాయి. పల్లె వెలుగు బస్సులో ఒక్కొక్కరికి రూ. 350 ఛార్జీ ఉంటుంది. ఆయా తేదీల్లో రోజూ ఉదయం 6 గంటలకు పార్వతీపురం కాంప్లెక్స్‌లో బస్సు బయలు దేరుతుంది. సాయంత్రం పార్వతీపురం చేరుకుంటుంది.

పంచారామ పుణ్యక్షేత్రాలకు..

పంచారామాలకు నవంబరు 03, 10, 17, 24 తేదీల్లో బస్సులు నడుపుతారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్య క్షేత్రాలను దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. పార్వతీపురం నుంచి ఒక్కొక్కరికి రూ. 2,150, బొబ్బిలి నుంచి రూ. 2,075, రామభద్రపురం నుంచి రూ. 2,050గా ఛార్జీలు ఉన్నాయి.

రిజర్వేషన్‌కు అవకాశం..

ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద రిజర్వేషన్‌కు అవకాశం కల్పించారు. 73828 34904, 90001 01080 చరవాణి నంబర్లను సంప్రదించినా టికెట్లు ఇస్తారు. సందేహాలకు 99592 25621, 73829 24103కు కాల్ చేయాలని డీఎం దుర్గ తెలిపారు. బస్సుకు సరిపడా భక్తులు ఉంటేనే నడుపుతామని వెల్లడించారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

వీరఘట్టం, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కళాధర్ వివరాల మేరకు.. వీరఘట్టం మండలం గడగమ్మకు చెందిన ఆర్.జనార్దనరావు (64) కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నారు. ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా నయం కాకపోవడంతో ఈ నెల 3న పురుగు మందు తాగి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు గమనించి పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హెచ్‌సీ రవిశేఖర్ కేసు నమోదు చేశారని ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత



పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పాచిపెంట పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంకట సురేష్ వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ ఖాన్, మహారాష్ట్రకు చెందిన జితేంద్ర రాజు ఒడిశాలో కొనుగోలు చేసి మండలంలోని చాపరాయివలస మీదుగా తరలిస్తున్నారు. శుక్రవారం గ్రామ సందర్శనకు వెళ్లిన సిబ్బందికి కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. 10 కిలోల సరకును మహారాష్ట్రకు తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరు పరిచామని ఎస్సై చెప్పారు.

12 అడుగుల గిరినాగు హతం



పాలకొండ మండలంలో చిలకలవలస సమీపంలో 12 అడుగుల కింగ్‌కోబ్రా పొలాల్లోకి రావడంతో రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. పనులు చేస్తుండగా బుసకొడుతూ వచ్చిన సర్పాన్ని గుర్తించిన రైతులు కర్రలతో కొట్టి హతమార్చారు. - న్యూస్‌టుడే, పాలకొండ

తప్పిన పెను ప్రమాదం


పొలంలో బోల్తా పడిన కర్రల లారీ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోని బుచ్చింపేట వద్ద పెను ప్రమాదం తప్పింది. ఒడిశాలోని హుకుంపేట నుంచి కర్రల లోడుతో వస్తున్న లారీ బుచ్చింపేటలోని ఆంజనేయ ఆలయం సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పింది. పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన చోదకుడు సింహాచలానికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కలెక్టరు ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 21న నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరు కానున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రజలు తమ సమస్యలపై నేరుగా వినతులు అందజేయాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ అభ్యర్థుల జాబితా

విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేజీబీవీల్లో బోధన, బోధనేతర(అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు మాత్రమే) పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసిన అభ్యర్థుల జాబితాను vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విజయనగరం డీఈవో ఎన్.ప్రేమకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు చూసుకోవాలని కోరారు.

సార్వత్రిక విద్యలో ప్రవేశాలకు గడువు పెంపు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. రూ. 200 అపరాధ రుసుముతో 29, రూ. 500తో 31 వరకు అవకాశం ఉందన్నారు. www.apopen-school.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు నమోదు చేసుకుని, సమీపంలోని ఓపెన్ కేంద్రానికి వెళ్లి, విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించి, రుసుము చెల్లించాలని కోరారు.

అర్హతలు ఇలా..

పదో తరగతిలో చేరేందుకు విద్యార్థులకు 2024 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు ఉండాలి. రికార్డు షీటు/టీసీతో పాటు ఆధారు కార్డు, తల్లి/తండ్రి ఆధార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలైతే కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులకు సదరం పత్రం/వైద్య ధ్రువీకరణ పత్రం అవసరం. విద్యార్హత లేకపోతే జనన ధ్రువీకరణ పత్రంతో పాటు చదవడం, రాయడం వచ్చని స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలి. ఇంటర్మీడియట్‌లో చేరాలంటే పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి. ఉత్తీర్ణత ధ్రువపత్రంతో పాటు ఆధార్ కార్డు, తల్లి/తండ్రి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలి. దివ్యాంగులైతే సదరం పత్రం ఇవ్వాలని డీఈవో సూచించారు.

గి.సం.శాఖలో ఉద్యోగోన్నతులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖలో ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం ఈఈగా పని చేస్తున్న కేవీఎస్ఎన్.కుమార్‌ను పర్యవేక్షక ఇంజినీరుగా నియమించి విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో డిప్యూటీ సీఈగా పంపించారు. పి.కోనవలస డీఈఈ మణిరాజుకు ఈఈగా ఉద్యోగోన్నతి కల్పించారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారి ధ్రువపత్రాలను శనివారం పరిశీలిస్తామని డీఈవో పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి పరిశీలన ప్రారంభం అవుతుందన్నారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ, డిప్లొమా, ఇతర ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696

? దిబ్బగూడ పాఠశాల వద్ద శిథిలమైన రెండు భవనాలు ఉన్నాయి. ఇక్కడ విద్యార్థులు ఆడుకునే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - **కృష్ణ, స్థానికుడు**

● భవనాలు తొలగించాలని ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారులను సూచించాం. మరోసారి తెలియజేస్తాం. - **ఎం.ఆనందరావు, ఎంఈవో**

- న్యూస్‌టుడే, సీతంపేట

? పాలకొండ వేమకోటివారివీధిలో కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. దుర్వాసన వస్తోంది. - **రామారావు**

● పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - **ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు**

- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? శివ్వాం పాఠశాల ముందు రహదారిపై మురుగు నిలిచిపోతుంది. రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - **విద్యార్థుల తల్లిదండ్రులు**

● కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. - **ఎల్.గోపాలరావు, ఈవోపీఆర్డీ**

- న్యూస్‌టుడే, గరుగుబిల్లి

? బుద్ధిపేట పాత, కొత్త ఊళ్ల మధ్య ప్రధాన రహదారిపై వరద నీరు పారుతోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - **వెంకటరమణ**

● వరద నీటి మళ్లింపునకు చర్యలు చేపడతాం. - **రమేష్, ఈవో, పెదభోగిల**

- న్యూస్‌టుడే, సీతానగరం

? ఎన్.ములగ అంజనేయస్వామి ఆలయం ముందు రోడ్డుపై మురుగు పారుతోంది. కాలువ పూడికతో నిండిపోవడంతో సమస్య ఏర్పడింది. - **స్థానికులు**

● పరిశీలించి చర్యలు చేపట్టేలా కార్యదర్శికి సూచిస్తాం. - **జీవీఆర్ మూర్తి, ఈవోపీఆర్డీ**

- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? పార్వతీపురంలోని విజయరామరాజు కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగు నిలిచిపోతోంది. - **సీతాలక్ష్మి**

● ప్రస్తుతం పట్టణంలో శుభ్రత పనులు చేస్తున్నాం. విజయరామరాజు కాలనీలోనూ చేపడతాం. - **పకీరురాజు, పారిశుద్ధ్య అధికారి**

- న్యూస్‌టుడే, బెలగాం

ప్రతిభ చూపారు




పార్వతీపురం పట్టణంలోని సురేష్ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల వారికి నిర్వహించిన పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై జరిగిన పోటీల్లో జె.ఉషశ్రీ (పదో తరగతి), కె.మనోజ్‌కుమార్ (తొమ్మిదో తరగతి), పి.శ్వేత (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ సరోజ్‌కుమార్ సాహూ, ఏవో జె.రవికుమార్, ఉపాధ్యాయుడు శంకరరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం, బెలగాం

కూటమి పాలనలో గ్రామ స్వరాజ్యం

భామిని, న్యూస్‌టుడే: గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని కూటమి ప్రభుత్వం చూపిస్తోందని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. చిన్న దిమిలి, లివిరి, బత్తిలిలో సీసీ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ఎంపీడీవో జె.చంద్రరావు, ఈవోపీఆర్డీ కృష్ణారావు, ఏఈ సత్యనారాయణ, తెదేపా మండలాధ్యక్షుడు బి.రవినాయుడు, కార్యదర్శి ఎం.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జయకృష్ణకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

పట్టణాభివృద్ధి.. ప్రణాళికలకే పరిమితం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే


కుద్దుల వీధి వెనుక భాగంలో మట్టి దారి

జిల్లా కేంద్రం, ప్రథమ స్థాయి పురపాలక సంఘం పార్వతీపురంలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. గత ఐదేళ్లలో ప్రణాళికలు వేయడం తప్ప పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది.

పుర పరిధిలో పాతబస్టాండ్ నుంచి సారికవీధి కూడలికి ఇరువైపులా వీధులు, జగన్నాథపురం, కొత్తవలసలో 20 వార్డులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువగా కచ్చా కాలువలే ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నేరుగా ఇళ్లలోకి చేరుతోంది. ప్రధాన రహదారితో పాటు పెదమాదిక, చినమాదిక, కుద్దుల వీధి, దేవాంగుల వీధి ప్రాంతాల్లో ఇదే సమస్యలు ఉన్నాయి. పట్టణంలోని 9, 10, 11 వార్డుల నుంచి వాడుక నీరు వరహాలు గెడ్డ కాలువకు వెళ్లేలా అనుసంధానం చేయాలి. కానీ మధ్యలో కమ్మయ్య బంద ఉండటంతో ఆ పనులు జరగలేదు. కొన్నాళ్లుగా ఈ బందలో పనికిరాని మొక్కలు పెరిగి మురుగు ముందుకు కదలడం లేదు.


పెదమాదిక వీధి వెనుక భాగంలో నిలిచిన మురుగు

పాలకవర్గాలు మారుతున్నా..

పట్టణాభివృద్ధిలో భాగంగా మూడు కిలోమీటర్ల పొడవున ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని గతంలో ప్రణాళికలు వేశారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో ఫుట్‌పాత్ నిర్మిస్తే ట్రాఫిక్ అంతరాయం తగ్గుతుందని ప్రతిపాదించారు. కానీ ఎక్కడా ఈ పనులేవీ జరగడం లేదు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు మారుతున్నా అడుగులు ముందుకు పడటం లేదు. పాతబస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల కూడలికి వెళ్లే కాలువ రహదారిలో సగభాగం దుకాణాలు ఆక్రమించడంతో సమస్య ఎక్కువగా ఉంది. వీటిపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దేవాంగుల వీధికి సరైన రహదారి, కాలువలు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో సమస్యలపై పురపాలక డీఈ కిరణ్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. కాలువలు, రహదారుల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నుంచి ప్రతిపాదనలు చేశామని తెలిపారు.

పెదపెంకిలో శుభ్రత చర్యలు

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో దోమల నియంత్రణలో భాగంగా మురుగు కుంటల్లో రంపపు పొట్టు, వ్యర్థ ఇంధనం కలిపి వేశారు. ఈనెల 7న 'ఈనాడు'లో 'పెదపెంకి ప్రతి వీధిలోనూ సమస్యలే' శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచి పాపారావు, సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఆదినారాయణ, కార్యదర్శి తిరుపతిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కాలువలో ఇంధనం వేస్తున్న సిబ్బంది

స్పందనకు వందనం

పైపులైనుకు మరమ్మతులు

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురంలో తాగునీటి పైపులైను పాడవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యపై ఈ నెల 14న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు స్పందించారు. పైపులైనుకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

వ్యర్థాల తొలగింపు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణ పరిధిలోని ఏనీకేరాజపురం కూడలిలో శుక్రవారం పనులు చేశారు. కూడలిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈనెల 14న స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. నగర పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

ఉద్యోగులపై పక్షపాత విధానం తగదు


ఆందోళన చేస్తున్న ఈయూ నాయకులు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ డిపోలో అధికారులు పక్షపాత విధానాలు విడనాడాలని ఈయూ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం డిపో ముందు ఆందోళన చేశారు. ఉద్యోగులకు చార్టుల ప్రకారం విధులు కల్పించాలని, విజయవాడ ఇంద్ర బస్సు వేరే డిపోకు బదిలీ చేయాలని కోరారు. పూర్తిస్థాయి ఏడీసీలను నియమించాలన్నారు. సహాయ ప్రబంధకుడి వైఖరిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో రక్తహీనత నివారణపై దృష్టి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజరు పి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బీజేపురంలో అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, జడ్పీ పాఠశాలను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలిచారు. రక్తహీనత లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. ఎంపీడీవో ఎస్.రమేష్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు ఎన్.గౌరమ్మ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఆందోళన

కలెక్టరేట్ ప్రాంగణం, కొమరాడ, సీతంపేట, సీతానగరం, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేసి సామాన్యులపై భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం విద్యుత్తు కేంద్రం వద్ద ఆందోళన చేసి ఈఈ గోపాలరావుకు వినతి పత్రం ఇచ్చారు. ● కొమరాడలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సాంబమూర్తి, సీతంపేట, సీతానగరం, సాలూరులో నాయకులు ఎ.భాస్కరరావు, పి.సాంబయ్య, ఎ.గంగాధర్, లక్ష్మునాయుడు, రమణమూర్తి, ఈశ్వరరావు, ఎన్వై నాయుడు తదితరులు నిరసన తెలిపారు.


పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎంపీడీవోపై విచారణ

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి ఎంపీడీవో పైడితల్లి అక్రమాలకు పాల్పడినట్లు మంత్రి నారా లోకేశ్‌కు తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డ్వామా పీడీ రామచంద్రరావు విచారణ చేపట్టారు. కారు వాడకుండానే బిల్లులు చేసుకున్నారని, ఉపాధి హామీ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు వెళ్లాయి. అనారోగ్య కారణాలతో ఎంపీడీవో రాలేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

వారాబందీ అమలుకు వినతి

పాలకొండ, న్యూస్‌టుడే: తోటపల్లి ఎడమ కాలువ పరిధిలో వారాబందీ అమలు చేయాలని సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని ఆయకట్టు రైతులు కోరారు. శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందించారు. అభ్యుదయ రైతు కె.ప్రసాదరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పాలకొండ ప్రాంతానికి సాగు నీరు అందలేదన్నారు. కేవలం వర్షాలతోనే పంటలు పండిస్తున్నామన్నారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయన్నారు.

మెరుగైన వసతి కల్పించాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వసతిగృహ విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని సాలూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి బి.కనకలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం రాత్రి మామిడిపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బొడ్డవలసలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.

నాణ్యత పరీక్షలు తప్పనిసరి

వీరఘట్టం: ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు 100 రోజుల్లో పూర్తి కావాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. వీరఘట్టంలో ఇంజినీరింగు సహాయకులతో సమావేశమయ్యారు. కాలనీలకు రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు కృష్ణచైతన్య, కావ్యశ్రీ, వినోద్ ఉన్నారు.

త్వరలో.. మహాప్రస్థానం సేవలు



ఐటీడీఏ అధికారులు సిద్ధం చేసిన వాహనం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: త్వరలో మన్యంలో మహా ప్రస్థానం వాహనం అందుబాటులోకి రానుంది. సంబంధిత సన్నాహాలను అధికారులు చేస్తున్నారు. ప్రమాదాలు, పిడుగు పాట్లు, పాము కాట్లు, హత్యలు, ఆత్మహత్యలు, అనారోగ్యం తదితర కారణాలతో ఏటా జిల్లా ఆసుపత్రిలో సుమారు 200 వరకు మృతి కేసులు నమోదవుతున్నాయి. దీంతో పాటు ఎక్కడెక్కడో మృతి చెందిన వారికి ఇక్కడ పోస్టుమార్టం నిర్వహిస్తారు. ఇలాంటి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ఎలాంటి సౌకర్యం లేదు. ఇన్నాళ్లు ప్రైవేటు వాహనాల్లో తరలించాలంటే రూ.వేలల్లో చేతి చమురు వదిలేది. పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఇది మరింత కుంగదీసేది.

రూ.30 వేల వరకు వసూలు..

గతంలో ఎవరైనా మృతి చెందితే శవాన్ని నాలుగైదు కిలోమీటర్ల దూరం తరలించాలంటే ఆటోకు రూ.6 వేలు వరకు వెచ్చించేవారు. దూర ప్రాంతాలైతే రూ.15 వేల నుంచి రూ.30 వేలు వరకు ప్రైవేటు వాహనదారులు డిమాండు చేసేవారు. మన్యంలో ఎక్కువగా గిరిజన ప్రాంతాలకు చెందిన వారే ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితిపై గతంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. పరిస్థితి గుర్తించిన కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర, డీసీహెచ్ఎస్ వాగ్దేవి స్పందించారు. మహాప్రస్థానం వాహనం ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల సూచనతో ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న అంబులెన్సును మహాప్రస్థానంగా తీర్చిదిద్దారు. కొత్తది మంజూరయ్యే వరకు ఈ వాహనం సేవలు అందుబాటులో ఉంటాయని డీసీహెచ్ఎస్ వాగ్దేవి తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో జిల్లా ఆసుపత్రికి అప్పగించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ గ్రామీణం: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా.ఎం.శ్యాంబాబ్ పేర్కొన్నారు. కళాశాలలో కుష్ఠుపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, గుర్తింపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు కె.ప్రసాద్ వివరించారు.

ఉచిత ఇసుక అందించాలి

సాలూరు గ్రామీణం: ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర డిమాండు చేశారు. సాలూరులో మాట్లాడారు. జిల్లాలో అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు.

బాధ్యతల స్వీకరణ



పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలకు పెద్ద పీట వేస్తామని ఎస్ఐ బి.సంతోషికుమారి పేర్కొన్నారు. శుక్రవారం పార్వతీపురం గ్రామీణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో పని చేసిన ఈమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ దినకర్ ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.

పక్కాగా భూసర్వే

పాలకొండ: భూ సర్వే పక్కాగా చేపట్టాలని జేసీ శోభిక పేర్కొన్నారు. శుక్రవారం పాలకొండలో రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా సమీక్షించారు. ఆర్డీవో యశ్వత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

పాలకొండ: గొట్టమంగళాపురానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కె.బుల్లిబాబు గురువారం రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో శుక్రవారం గ్రామంలో నిర్వహించారు. డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కురుపాం గ్రామీణం: మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక విజయ్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పీడీ పి.చంద్రమోహన్ తెలిపారు. ఇటీవల పార్వతీపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. విజయ్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వ్యర్థాలతో అవస్థలు



పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన కూడళ్లు వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని చెత్త తొట్టెలకు రంధ్రాలు పడటంతో వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. ఏడేళ్ల క్రితం పట్టణంలో ఏర్పాటు చేసిన 20 చెత్త తొట్టెలదీ ఇదే పరిస్థితి. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త తొట్టెలు ఏర్పాటు చేస్తామని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. - **న్యూస్‌టుడే, పాలకొండ**

రెండేళ్లుగా పునాదుల్లోనే!



సీతానగరం మండలంలోని లచ్చయ్యపేటలో సచివాలయం, రైతు సేవా కేంద్రాల భవనాలు పునాదులకే పరిమితం అయ్యాయి. రెండేళ్ల క్రితం వీటి నిర్మాణం ప్రారంభించారు. స్తంభాల వరకు పనులు చేసి వదిలేశారు. దీంతో ప్రస్తుతం వాటికి లతలు అల్లుకున్నాయి. సరైన గదులు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు. దీనిపై జేఈ చంద్రమౌళి వద్ద ప్రస్తావించగా.. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - **న్యూస్‌టుడే, సీతానగరం**

వంతెనపై మొక్కలు కనిపించడం లేదా..?

పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస వద్ద నున్న వంతెనపై రావి చెట్లు మొలిచాయి. కొన్ని నెలలుగా పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వంతెన పాడయ్యే అవకాశం ఉంది. దీనిపై ర.భ.శాఖ ఏఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా.. పురపాలిక అధికారులతో మాట్లాడి రావి మొక్కలను తొలగిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, బెలగాం**



300 మందికి ఆరోగ్య పరీక్షలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని గిరిశిఖర టీకేజమ్ములో రూట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు సూర్య, స్మిత, లిఖిత, బోనీ, రాజేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.


కళ్లు పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ


విద్యార్థులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకొని సాగులో నూతన పద్ధతులు అవలంబించాలని కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డా.ఎం.అనంతవిహారి సూచించారు. శుక్రవారం రస్తాకుంటుబాయి కేవీకేలో శ్రీకాకుళం జిల్లాలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కేవీకే ద్వారా అందిస్తున్న సేవలు, వర్మీ కంపోస్టు, పుట్ట గొడుగుల తయారీ, పౌల్ట్రీ, చిరుధాన్యాల డెమో యూనిట్లు చూపించారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట పీహెచ్‌సీలోని రక్త పరీక్ష కేంద్రం, ప్రయోగశాలను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చేస్తున్న రక్త పరీక్షల తీరును పరిశీలించారు. రక్తహీనత కేసులు నమోదైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలోదస్త్రాలు, మందులు పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.


మందులు పరిశీలిస్తున్న జగన్మోహనరావు

లక్ష్యాలతో సాగితే ఉన్నత శిఖరాలు


వంటలు పరిశీలిస్తున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

కొమరాడ, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుతారని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. శుక్రవారం కొమరాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థినులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. బాలికల్లో రక్తహీనత రాకుండా చూడాలని, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

ధర తగ్గింపు ఆలోచన సరికాదు

పాచిపెంట, సీతానగరం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యజమాన్యం పాల ధర తగ్గింపు ఆలోచనను విరమించుకోవాలని పలువురు పాడి రైతులు డిమాండు చేశారు. పాచిపెంటలోని పాల సేకరణ కేంద్రం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. రైతులు శంకరరావు, రామారావు, అప్పలనాయుడు ఉన్నారు. ★ సీతానగరం మండలంలోని కాశాపేట పాల శీతలీకరణ కేంద్రం వద్ద పాడి రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకుడు ఎం.కృష్ణమూర్తి, రైతులు లక్ష్మునాయుడు, రమణమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.


పాచిపెంటలో ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పరిశ్రమలపై అవగాహన అవసరం

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వయం వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకొని రాణించాలని కళాశాల అధ్యాపకులు సూచించారు. ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోజర్ కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం కురుపాం పామాయిల్ పరిశ్రమను సందర్శించారు. ముడిసరకు, తయారీ విధానం, అమ్మకాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. అధ్యాపకులు ఎస్.సింహాచలం, హరికృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

(c) eenadu